సాక్షి నిజామాబాద్

మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



ప్రజావాణికి 61 ఫిర్యాదులు

నిజామాబాద్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి 61 ఫిర్యాదులు వచ్చాయి.

- 8లో ▸



సౌకర్యాలను మెరుగుపరుస్తాం

తెలంగాణ యూనివర్సిటీలో క్రీడా సౌకర్యాలను మెరుగుపరుస్తామని రిజిస్ట్రార్ యాదగిరి పేర్కొన్నారు.

- 8లో ▸


గరిష్టం/కనిష్టం
33.0 /22.3

వాతావరణం

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి ప్రభావం కొనసాగుతుంది.

పకడ్బందీగా పరీక్షలు

- రేపటి నుంచి ఇంటర్ ఎగ్జామ్స్
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం
- మాస్ కాపీయింగ్‌కు తావులేదు
- విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు
- డీఐఈవో రఘురాజ్



నిజామాబాద్‌అర్బన్: ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయని.. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని డీఐఈవో రఘురాజ్ తెలిపారు. కాపీయింగ్‌కు తావులేకుండా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దని.. ప్రశాంతంగా ఎగ్జామ్స్ రాయాలని సూచించారు. పరీక్షల నిర్వహణపై 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరాలు వెల్లడించారు.

ప్రశ్న: పరీక్షల ఏర్పాట్లు ఎలా సాగుతున్నాయి ?

జవాబు: జిల్లాలో పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లను పూర్తి చేశారు. సిబ్బందికి ప్రస్తుతం శిక్షణ ఇస్తున్నాం. పరీక్షల కోసం జిల్లాలో 57 సెంటర్లను ఏర్పాటు చేశాం. మూడు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించాం.

■ మాస్ కాపీయింగ్ నిరోధానికి చర్యలు?

● జిల్లాలో రెండేళ్లుగా మాస్ కాపీయింగ్ పూర్తిగా అరికట్టాం. మాస్‌కాపీయింగ్ జరగకుండా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. సెంటర్లలో తనిఖీలు నిర్వహిస్తాం. ముఖ్యంగా ప్రైవేటు కళాశాలపై ప్రత్యేక నిఘా ఉంటుంది.

■ జిల్లాలో ఎంత మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు ?

● ఇంటర్ పరీక్షలకు సంబంధించి ఈ యేడు 35,346 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. ఫస్టియర్‌లో 17,364 మంది, సెకండియర్‌లో 17,982 మంది ఉన్నారు. మొదటి సంవత్సరంలో 14,965 మంది జనరల్ విద్యార్థులు, 2,399 ఒకేషనల్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. రెండో సంవత్సరంలో 13,986 మంది రెగ్యులర్ విద్యార్థులు, 1999 మంది ఒకేషనల్ ఉన్నారు.

■ జిల్లాలో కొన్ని ప్రైవేటు కాలేజీలు కాపీయింగ్‌కు ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి ?

● ఇందులో నిజం లేదు. ప్రతి సెంటర్‌ను ప్రత్యేక బృందాలు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. ప్రతి సెంటర్ మా కంట్రోల్‌లో ఉంటుంది. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలను, సిబ్బందిని అనుమతించబోం. బోధన్, ఆర్మూర్‌తో పాటు కొన్ని దూరప్రాంతాల కేంద్రాలపై గతంలో ఆరోపణలు వచ్చాయి. అలాంటి వాటిపై ఈసారి ప్రత్యేక నిఘం పెట్టాం.

■ కొన్ని ప్రైవేటు కళాశాలలు ఫీజు కట్టని విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి ?

● హాల్ టికెట్లు విద్యార్థులు నేరుగా ఇంటర్నెట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం ఉంది. అలా కాకుండా ప్రైవేటు కళాశాలలు హాల్ టికెట్ కోసం విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తే మా దృష్టికి తీసుకురావాలి.

■ ప్రైవేటు కాలేజీలకు అనుకూలంగా ఉండేలా సిబ్బంది నియమించినట్లు ఆరోపణలున్నాయి?

● పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు ప్రభుత్వ కళాశాలలు చెందినవారే ఉంటారు. ఇన్విజిరేటర్లను సైతం జిల్లా విద్యాశాఖ నుంచి కొందరిని తీసుకోవడం జరుగుతుంది. అవసరమైన మేరకు మాత్రమే ప్రైవేటు సిబ్బంది ఉంటారు. అయినా కూడా వీరిని వేరే సెంటర్లలో ఇన్విజిలేటర్లుగా కొనసాగిస్తాం. ఇక్కడ తప్పులకు ఆస్కారం ఉండదు.

■ ఫోన్ల నిషేధానికి చర్యలు తీసుకుంటున్నారా?

● పరీక్ష కేంద్రంలో పూర్తిగా ఫోన్లు నిషేధించాం. అధికారులు, సిబ్బంది సైతం ఫోన్లు వాడకూడదు. విద్యార్థులు సెంటర్‌లోకి వచ్చే ముందు క్షుణ్ణంగా పరిశీలన చేస్తాం.

■ నిమిషం నిబంధన అమలు చేస్తున్నారా..?

● పరీక్ష ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుంది. విద్యార్థులు ఉదయం 8.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించబోం. ప్రతి విద్యార్థి కచ్చితంగా నిర్దేశించిన సమయానికి రావాలి. విద్యార్థుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు నడపాలని అధికారులను కోరాం.

బీఆర్‌ఎస్‌కు బిగ్ షాక్



బోధన్‌లో వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్న ఆర్మూర్ బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

- కాంగ్రెస్‌లో చేరిన ఆర్మూర్ మున్సిపల్ కౌన్సిలర్లు
- వైస్ చైర్మన్‌తో పాటు మరో 14 మంది హస్తం గూటికి..
- మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డికి హ్యాండిచ్చిన కౌన్సిలర్లు
- మరో మలుపు తిరిగిన మున్సిపల్ రాజకీయం

ఆర్మూర్: ఆర్మూర్ మున్సిపల్ రాజకీయం మరో కీలక మలుపు తిరిగింది. మున్సిపల్ వైస్‌చైర్మన్‌తో పాటు బీఆర్‌ఎస్‌కు చెందిన 14 మంది కౌన్సిలర్లు హస్తం గూటికి చేరారు. ఒకవైపు అధికారం చేజారకుండా కాపాడుకోవడం కోసం మాజీ చైర్‌పర్సన్ పండిత్ వినీత వర్గీయులు హైకోర్టు చీఫ్ జస్టిస్‌కు అప్పీలు చేసుకోగా కేసును న్యాయమూర్తి డిస్మిస్ చేశారు. మరోవైపు వినీత వర్గీయులకు చెక్ పెడుతూ ఆర్మూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్‌మున్నుతో పాటు 14 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి సమక్షంలో హస్తం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. దీంతో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డికి గట్టి షాక్ తగిలినట్లయ్యింది. ఆర్మూర్ మున్సిపాలిటీలో రెండున్నర నెలలుగా చైర్మన్ పీఠం కోసం ఇరువర్గాలు ఎత్తుకుపైఎత్తులు వేస్తున్న విషయం విదితమే. తాజాగా బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు వినీత వర్గీయులపై హైకోర్టులో విజయం సాధించి చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లుగా ఉత్తర్వులు పొందారు. అంతేకాకుండా వినీతను వ్యతిరేకిస్తున్న 20 మందిలో 15 మంది కౌన్సిలర్లు అధికార పార్టీ అండ ఉంటేనే అధికార మార్పు సులభంగా జరుగుతుందని ఆశించి తాజాగా కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఈ అనూహ్య పరిణామం బీఆర్‌ఎస్ పార్టీకి కోలుకోలేని దెబ్బ. కాంగ్రెస్‌లో చేరిన వారిలో ఆర్మూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ మున్నుతో పాటు ఖాందేశ్ సంగీత శ్రీనివాస్, వన్నెల్ దేవి లావణ్య శ్రీనివాస్, మేడిదాల సంగీత రవి గౌడ్, ఇట్టెడి నర్సారెడ్డి, బండారి ప్రసాద్, కొనపత్రి కవిత కాశీరాం, లిక్కి శంకర్, ఇంతియాజ్, ఆకుల రాము, వనం శేఖర్, సుంకరి ఈశ్వరి రంగన్న, ఆయేషా శిరిన్ (ఫయాజ్), పుల్లి బేగం(రహమాన్), నజీవీన్ సుల్తాన్ అతిక్ ఉన్నారు. అయితే ఆర్మూర్ మున్సిపాలిటీలో మొత్తం 36 మంది కౌన్సిలర్లు ఉండగా వినీత వర్గంలో ఉన్న 12 మంది కౌన్సిలర్లు సైతం త్వరలో కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అదే జరిగితే ఆర్మూర్ మున్సిపాలిటీపై త్వరలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయంగా కనిపిస్తోంది. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గడుగు గంగాధర్, నాయకులు యాల్ల సాయిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సాయిబాబాగౌడ్, కోల వెంకటేశ్, గుండోల్ల వెంకట గిరి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

గిరిరాజ్ కళాశాల డిగ్రీ ఫలితాలు విడుదల

నిజామాబాద్‌అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల డిగ్రీ ఫలితాలు సోమవారం విడుదలయ్యాయి. తెలంగాణ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారిణి అరుణ, అదనపు అధికారిణి శాంతాబాయి, కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి రిజల్ట్స్‌ను విడుదల చేశారు. బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ ఒకటో, మూడో, ఐదో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ ఫలితాలు వెలువడ్డాయి. మొదటి సెమిస్టర్ 50.40శాతం, మూడో సెమిస్టర్‌లో 60.13 శాతం, ఐదో సెమిస్టర్‌లో 70.9 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రీవాల్యుయేషన్ కోసం మార్చి ఒకటి నుంచి కళాశాలలోని పరీక్ష విభాగంలో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రామ్మోహన్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

స్వప్నరాణికి సంగీతంలో పీహెచ్‌డీ

- తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం నుంచి..



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: నగరంలోని శ్రీజ్ఞాన సరస్వతి సంగీత, డ్యాన్స్ స్కూల్ అసిస్టెంట్ లెక్చరర్ స్వప్నరాణి సంగీతంలో పీహెచ్‌డీ సాధించారు. 'ఇందూరు జానపదంలో శాస్త్రీయ ధోరణులు' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన వైవాలో ఆమెకు డాక్టరేట్ ప్రకటించారు. పీహెచ్‌డీ పరిశోధనలో గైడ్ ప్రొఫెసర్ సరస్వతి వాసుదేవ్, వైవాలో ఎగ్జామినర్ సంగీతాచార్య, డాక్టర్ వైజర్సు బాల సుబ్రమణ్యం, మ్యూజిక్ అండ్ ఫైన్ ఆర్ట్స్ హెడ్ డాక్టర్ శైలేశ్వరి, డీన్ ఆఫ్ సోషల్ సైన్స్ డాక్టర్ వాణి ఆధ్వర్యంలో వైవా నిర్వహించారు. పీహెచ్‌డీ ప్రకటనపై స్వప్నరాణి సంతోషం వ్యక్తం చేశారు.

పరిశీలన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి



సుభాష్‌నగర్: బ్యాలెట్ యూనిట్ల ప్రాథమిక పరిశీలన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. నగరంలోని వినాయక్‌నగర్‌లో గల ఈవీఎం గోదామ్‌ను సోమవారం సందర్శించారు. రానున్న పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు అదనంగా కేటాయించిన 510 బ్యాలెట్ యూనిట్లను రాజకీయ పార్టీల సమక్షంలో తెరిచారు. అనంతరం ఈసీఐఎల్ నుంచి వచ్చిన 13 మంది ఇంజినీర్లతో కూడిన బృందంతో కలెక్టర్ భేటీ అయ్యారు. బ్యాలెట్ యూనిట్ల పనితీరును పూర్తిస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను కలెక్టర్ పర్యవేక్షించి, ఎన్నికల సంఘం నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా ఉప ఎన్నికల అధికారిణి కృష్ణవేణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్, సంతోష్ తదితరులున్నారు.

అయ్యప్ప ఆలయానికి స్వర్ణ ఖడ్గం బహూకరణ



నిజామాబాద్ సిటీ : నగరంలోని కంఠేశ్వర్ అయ్యప్ప ఆలయంలో స్వామివారికి సోమవారం స్వర్ణ ఖడ్గం బహూకరించారు. హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతిస్వామి ప్రత్యేక పూజలు చేసి, స్వామి వారికి స్వర్ణ ఖడ్గం అలంకరించారు. దాతలు విరాళాలుగా అందజేసిన బంగారం, నగదుతో 80 తులాల బంగారంతో స్వర్ణ ఖడ్గం తయారు చేయించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణలో అతిపెద్ద అయ్యప్ప ఆలయం నగరంలో ఉండటం గర్వకారణమన్నారు. ఆలయం దినదిన అభివృద్ధి చెందుతోందన్నారు. ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామికి బంగారు ఖడ్గాన్ని అలంకరించటం సంతోషకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆలయాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ దండు నీతూకిరణ్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, అయ్యప్ప మందిరం అధ్యక్షుడు భక్తవత్సలం నాయుడు, ప్రధాన కార్యదర్శి ధనుంజయ్, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కేశ వేణు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ క్లోజ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్

- కేసీఆర్ అహంకార ధోరణితోనే ప్రజలు గద్దెదించారు
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్

ఖలీల్‌వాడి: ఎంపీ ఎన్నికల తర్వాత బీఆర్‌ఎస్ పార్టీ క్లోజ్ అవుతుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఎప్పుడు ప్రజల్లో ఉండే సీఎం రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ అహంకారపు మాటలు మానుకోవాలని సూచించారు. కేటీఆర్ అధికారం కోల్పోయిన తర్వాత మతితప్పి మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రజలు కార్రుకాల్చివాతపెట్టినా కేటీఆర్‌కు బుద్ధిరాలేదన్నారు. సీఎం చేసే పనులకు ప్రజలు బ్రహ్మరథం పడితే కేటీఆర్ జీర్ణించుకోలేక పోతున్నారని మండిపడ్డారు. తొమ్మిదిన్నరేళ్లలో కేసీఆర్ అహంకారపు ధోరణి అవలంభించడంతో ప్రజలు గద్దెదించారని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఒక దగ్గర కట్టాల్సి ఉండగా.. మరోచోట నిర్మించి కమిషన్లు దోచుకున్నారని ఆరోపించారు. కృష్ణాజలాలను ఆంధ్రాకు తాకట్టు పెట్టి, తెలంగాణ రైతులకు సాగునీరు, తాగునీటికి ఇక్కట్లు పడేలా చేశారని పేర్కొన్నారు. తొమ్మిదిన్నరేళ్లలో రూ. 7లక్షల కోట్ల అప్పులు చేశారని వివరించారు. మంగళవారం మహిళలకు రూ. 500 గ్యాస్‌సిలిండర్, గృహలక్ష్మి పథకాలు అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నగరాధ్యక్షుడు కేశవేణు, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, రత్నాకర్, రాంభూపాల్, రామర్తి గోపి, ప్రీతమ్, వీక్కీయాదవ్, రాజనరేందర్‌గౌడ్, వైశాక్షి సంతోష్, బొబ్బిలి నర్సయ్య, సయ్యద్‌కైసర్, నరేందర్ సింగ్, లవంగప్రమోద్, దయాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ హయాంలో హైస్పీడ్‌తో అభివృద్ధి

- ఎంపీ ధర్మపురి అర్వింద్
- బోధన్ ఆర్వోబీ నిర్మాణానికి వర్చువల్‌గా ప్రధాని శంకుస్థాపన



ఆర్వోబీ నిర్మాణ పనుల శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి

బోధన్ : ప్రధాని మోదీ హయాంలో దేశం హైస్పీడ్‌తో అభివృద్ధి చెందుతోందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. బోధన్‌లో గాంధీ పార్కు వద్ద ఆర్‌వోబీ నిర్మాణానికి సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. బీజేపీ పాలనలో గతంలో ఎప్పుడు లేని విధంగా జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణాలు జరిగాయన్నారు. జిల్లాలో ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న అర్సపల్లి ఆర్‌వోబీకి రూ.142కోట్లతో శంకుస్థాపన చేశామని, మాధవనగర్ వద్ద ఆర్‌వోబీ పనులు సాగుతున్నాయన్నారు. ఆర్మూర్ ప్రాంతంలో మూడు ఆర్‌వోబీలు మంజూరు కాగా ఒకటి పూర్తయిందన్నారు. బోధన్ ఆర్‌వోబీ గురించి గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో జాప్యం జరిగిందన్నారు.

'రాయలసీమ ఎక్స్‌ప్రెస్' పొడిగింపునకు చర్యలు

నిజామాబాద్ నుంచి తిరుపతి వరకు నడుస్తున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ బోధన్ నుంచి నడిచేలా చర్యలు తీసుకుంటామని ఎంపీ తెలిపారు. ఈ రైలు హాల్టింగ్ కోసం నిత్యం బోధన్ వస్తోందని, కానీ ఇక్కడ ప్రయాణికులు ఎక్కడానికి అవకాశం లేదన్నారు.

బోధన్‌లోనే టిక్కెట్ తీసుకుని ఇక్కడి నుంచే ప్రయాణించే సౌకర్యం త్వరలో కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ను బోధన్ వరకు పొడిగించాలని డిమాండ్ ఉందని, ఈ విషయం రైల్వే శాఖ మంత్రి దృష్టిలో ఉందన్నారు. అలాగే నవీపేట, ఎడపల్లి మండల కేంద్రాల్లో ఆర్‌వోబీల నిర్మాణానికి ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. బోధన్ ఆర్‌వోబీని నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయిస్తామన్నారు. రాజకీయాలు, అభివృద్ధి వేర్వేరుగా చూడాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే, ఎంపీలు కలిసి అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించిన పరిస్థితులు లేవన్నారు. ఇప్పుడు ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డితో కలిసి ఆర్‌వోబీ పనులకు శంకుస్థాపన చేయడం మంచి పరిణామమని పేర్కొన్నారు.

రాష్ట్రం పచ్చగా ఉండాలి

- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలాగా పాడి పంటలతో శోభిల్లాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



వర్ని ఎంపీపీ లక్ష్మి వీర్రాజుకు కండువా వేసి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మంత్రి తుమ్మల

బాన్సువాడ/వర్ని: పచ్చని, పాడిపంటలకు నిలయమైన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా మాదిరిగానే తెలంగాణ మొత్తం ఉండాలని తన కోరికని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం బాన్సువాడలోని మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి క్యాంపు ఆఫీస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరారు. వర్ని ఎంపీపీ మేక శ్రీలక్ష్మి వీర్రాజు, వకీల్ ఫారం, కూనిపూర్, జలాల్‌పూర్, సిద్దాపూర్ గ్రామాల తాజా మాజీ సర్పంచ్‌లు భూలక్ష్మి వెంకట్రావ్, శశికళ, అనిత వెంకట్‌గౌడ్, కల్యాబాయి దశరథ్‌లు వారి అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ వ్యవసాయంలో ఉన్న సంతృప్తి ఎందులో నూ దొరకదన్నారు. మన వృత్తి, ప్రవృత్తి వ్యవసాయమేనని, దాన్ని వదిలిపెట్టవద్దని కోరారు. రైతులు హార్టికల్చర్‌పై దృష్టి సారించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అసంబద్ధ కార్యక్రమాలు, పొరపాట్ల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఒడిదొడుకుల్లో ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు యలమంచలి శ్రీనివాస్ రావు, కూనిపూర్ రాజిరెడ్డి, మైలారం భాస్కర్‌రెడ్డి, మాసాని శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



కోటగిరిలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

వ్యవసాయ కళాశాల మంజూరుకు కృషి

రుద్రూర్(బాన్సువాడ): జిల్లాలో వ్యవసాయ కళాశాల మంజూరుకు కృషి చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం కోటగిరిలో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో పేదల కోసం ఎన్టీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ బీబీపాటిల్, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు లక్ష్మీనారాయణ, ఏనుగు రవీందర్‌రెడ్డి, ఎంపీపీ సునీత శ్రీనివాస్ పాల్గొన్నారు.

అర్ధరాత్రి వరకు దుకాణాలు తెరిస్తే చర్యలు

ఖలీల్‌వాడి: జిల్లాలో అర్ధరాత్రి వరకు దుకాణాలు తెరిచి ఉంచితే శాశ్వతంగా మూసి వేస్తామని సీపీ కల్మేశ్వర్ సోమవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. రాత్రి వరకు తెరిచి ఉంచుతున్న పలు వ్యాపార సముదాయాలు నేరస్తులకు అడ్డాలుగా మారుతున్నాయని తెలిపారు. రాత్రి 10.30లోపు షాపులను మూసి వేయాలన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్ నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచుతున్న దుకాణాలపై చర్యల కోసం వారం రోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు నిజామాబాద్ డివిజన్‌లో ఐదు దుకాణాలపై కేసు నమోదు చేశామన్నారు. దీనిలో రెండు దుకాణాల యజమానులకు నాలుగు రోజుల జైలు శిక్ష పడిందన్నారు. బోధన్ డివిజన్‌లో రెండు కేసులు నమోదు చేసినట్లు వివరించారు.

నేడు జిల్లాకు విజయ సంకల్ప యాత్ర

సుభాష్‌నగర్: బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన విజయ సంకల్పయాత్ర మంగళవారం జిల్లాకు రానుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులా చారి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొమురం భీం క్లస్టర్ విజయ సంకల్ప బస్సుయాత్రకు కమ్మర్‌పల్లి వద్ద ఘన స్వాగతం పలుకుతామని పేర్కొన్నారు. కమ్మర్‌పల్లి నుంచి మోర్తాడ్, ధర్పల్లి, రామడుగు, కలిగోట్ మీదుగా ఆర్మూర్‌కు యాత్ర చేరుకుంటుందన్నారు. యాత్రకు ముఖ్యఅతిథులుగా బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీమంత్రి ఈటల రాజేందర్, ఎంపీ ధర్మపురి, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నపూర్ణమ్మ హాజరుకానున్నారని తెలిపారు.

ఎత్తు పెంచం.. మంచిప్పను ముంచం



ఎమ్మెల్యే భూపతిరెడ్డికి నాగలిని బహూకరిస్తున్న ముంపు నిర్వాసితులు

- సీఎంతో మాట్లాడి నిర్వాసితులు, రైతులపై కేసులు ఎత్తేస్తాం
- వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌కు కట్టుబడి ఉన్నాం
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మంచిప్ప ప్రాజెక్ట్ ఎత్తు పెంచేది లేదని, గ్రామాన్ని ముంచేది లేదని, ఈవిషయాన్ని ఇప్పటికే సీఎంతో చర్చించానని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి స్పష్టం చేశారు. ఒక్క గుంట కూడా మునగకుండా చర్యలు చేపడుతున్నామని, గ్రామస్తులు ఆందోళనకు గురి కావద్దని భరోసానిచ్చారు. సోమవారం మంచిప్ప, బాడ్సిలో సొసైటీ గోదాముల, సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. అనంతరం వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంతకుముందు ఒడ్డెరకాలనీ జీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి మంచిప్ప ముంపు నిర్వాసితులతోపాటు ఎర్రజొన్న, పసుపు రైతులపై ఉన్న కేసులు ఎత్తేయిస్తామని తెలిపారు. 27న చేవెళ్లలో 200 యూనిట్ల విద్యుత్, రూ. 500లకే సిలిండర్ పథకాలు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌కు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాష్ట్రంలోని అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తామని భూపతిరెడ్డి పేర్కొన్నారు. రుణమాఫీ, పంటలకు మద్దతు ధరకు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్‌ఖేత్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, నాయకులు గడ్కోల్ భాస్కర్‌రెడ్డి, కెతావత్ యాదగిరి, ఎల్లోల సాయిరెడ్డి, నిర్మల, ప్రతాప్‌సింగ్, వెంకట్రాం, సంతోష్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, అజీమ్, రాజేష్, గోవూరు నరేశ్‌రెడ్డి, సాయిరాం, ప్రవీణ్‌రెడ్డి, కాలూరు భోజన్న, వాసు, సిద్దార్థ, రాములు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



తెయూ(డిచ్‌పల్లి): మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన సంస్కృతి ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభకనబర్చిన యూనివర్సిటీ విద్యార్థులను రిజిస్ట్రార్ యాదగిరి సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో తెలంగాణ యూనివర్సిటీకి ప్రత్యేక గుర్తింపు లభించేలా విజయయాత్ర కొనసాగించాలని విద్యార్థులకు సూచించారు. ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ సంపత్, వెంకటేశ్వర్లు, విద్యార్థులు బ్రహ్మానంద్, వెంకటేశ్, డానియల్, శరత్‌కుమార్, సుమిత్ర, శంకు అఖిల,సోనియా పాల్గొన్నారు.

ప్రశాంతంగా పీజీ సెమిస్టర్స్

- 110 మంది విద్యార్థుల గైర్హాజరు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో పీజీ మొదటి, ఇంటిగ్రేటెడ్ పీజీ సెమిస్టర్ ఏడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా కొనసాగినట్లు ఆడిట్‌సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. నిజామాబాద్ నగరంలోని గిరిరాజ్ గవర్నమెంట్ పీజీ కాలేజీ పరీక్షాకేంద్రాన్ని ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తనిఖీ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఇన్విజిలేటర్లకు సూచించారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 1,911 మంది విద్యార్థులకు గాను 1,801 మంది హాజరుకాగా, 110 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

ముగిసిన ఎస్బీఐ స్పోర్ట్స్ మీట్



నిజామాబాద్ సిటీ: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులకు నిర్వహించిన ఇంటర్ జోన్ స్పోర్ట్స్ మీట్ ముగిసింది. నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్, గోదావరిఖని, మంచిర్యాల్ రీజియన్ల పరిధిలోని బ్రాంచ్‌ల ఉద్యోగులకు నిజామాబాద్‌లో క్రీడాపోటీలు నిర్వహించారు. టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, చెస్, క్యారం పోటీలు నిర్వహించారు. విజేతలకు డిప్యూటీ జనరల్ మేనేజర్ సూర్యకాంతదాస్ మెడల్స్, బహుమతులను అందజేశారు.

విద్యుత్ సరఫరాలో కోతలు ఉండవు

నిజామాబాద్‌నాగారం: జిల్లాలో విద్యుత్ సరఫరాలో కోతలు ఉండవని, అనవసరంగా కరెంట్ కట్ చేయొద్దని విద్యుత్‌శాఖ ఎస్ఈ రవీందర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో విద్యుత్‌వినియోగం పెరిగినప్పటికీ.. సరఫరాలో కోతలు విధించడం లేదని పేర్కొన్నారు. లైన్ బ్రేక్‌డౌన్, విద్యుత్ పరికరాల మరమ్మతులు చేపట్టినప్పుడు మాత్రమే విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు. అనవసరంగా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూం 94408 11600 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. 24గంటలపాటు కంట్రోల్ రూం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ప్రజావాణికి 61 ఫిర్యాదులు

- అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలి
- అధికారులకు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశం

సుభాష్‌నగర్: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 61 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, అదనపు కలెక్టర్ (యూటీ) కిరణ్మయి, జెడ్పీ సీఈవో ఉష, డీఆర్డీవో సాయాగౌడ్, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు అందజేశారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అధికారులు

ఎస్ఎఫ్‌డీ ఆధ్వర్యంలో..

స్టూడెంట్స్ ఫర్ డెవలప్‌మెంట్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. జిల్లాలోని పల్లెప్రకృతి వనాల్లో, పార్కుల్లో, రోడ్లకిరువైపులా, రోడ్ల మధ్యలో కోనోకార్పస్ మొక్కలు నాటారని.. వాటిని వెంటనే తొలగించాలని డిమాండ్‌చేశారు. ఉన్నతాధికారులతో చర్చించి మొక్కల తొలగింపుపై చర్యలు చేపడుతామని అదనపు కలెక్టర్ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. నాయకులు మనోజ్‌కుమార్, సునీల్, దుర్గాదాస్, సాయికుమార్ పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి



అంగన్‌వాడీ హెల్పర్లను పాత పద్ధతిలో నియమించాలని, బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు రమేశ్‌బాబు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కైరి దేవగంగు మాట్లాడుతూ.. స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ఖాళీలు భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అంగన్‌వాడీలకు పదోన్నతులు కల్పించాలని, విద్యార్హతను పెంచడం కారణంగా హెల్పర్లు ప్రమోషన్లు పొందడం లేదన్నారు. మూడు నెలల బకాయి, సమ్మెకాలానికి సంబంధించిన వేతనాలను వెంటనే చెల్లించాలన్నారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి స్వర్ణ, కోశాధికారి చంద్రకళ, నాయకులు మంగాదేవి, శివరాజమ్మ, వాణి, గోదావరి, యమునా, సునంద, లక్ష్మి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ఆత్మహత్యాయత్నం



కలెక్టరేట్ ఎదుట బైటాయించిన సమద్

సుభాష్‌నగర్: నగరంలోని కలెక్టరేట్ ప్రధాన గేటు ఎదుట కామారెడ్డి జిల్లా జుక్కల్ మండల కేంద్రానికి చెందిన ఎస్‌కే సమద్ కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్‌కే సమద్ కొంతమందిని తీసుకుని సదరం సర్టిఫికెట్ల కోసం నిజామాబాద్ కలెక్టరేట్‌కు వచ్చాడు. ప్రధాన గేటు వద్ద పేర్లు నమోదు చేసుకునే సమయంలో తమది కామారెడ్డి జిల్లా అని చెప్పడంతో, అక్కడి కలెక్టరేట్‌కు వెళ్లాలని సిబ్బంది సూచించారు. తాను ఇక్కడే అధికారులను కలుస్తానని సమద్ మొండికేశాడు. సిబ్బంది లోనికి అనుమతించకపోవడంతో ఒంటిపై కిరోసిన్ పోసుకున్నాడు. పోలీసులు గమనించి అడ్డుకుని అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సమద్‌ను ఇంటికి పంపించారు.

చిగురించిన ఆశలు

- త్వరలోనే 'ధరణి' సమస్యలకు పరిష్కారం!



నిజామాబాద్ రూరల్: జిల్లాలోని నిజామాబాద్ రూరల్ మండలం బర్దిపూర్ గ్రామానికి చెందిన శంకర్ అనే వ్యక్తికి గ్రామ శివారులో నాలుగు ఎకరాల పట్టా భూమి ఉంది. 2018లో ఆ భూమిని ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ నూతన పట్టాపాస్ పుస్తకం ఇచ్చారు. ఆ ఒక్క సర్వే నంబర్‌లో సుమారు 13 ఎకరాల భూమి ఉండగా, అందులో శంకర్ అనే వ్యక్తి భూమి మాత్రమే ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ పట్టాపాస్‌పుస్తకం ఇచ్చారు. తప్పును సరి చేయాలని కోరుతూ శంకర్ తహసీల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నాడు. ఇలాంటి సమస్యలు ఎదుర్కొంటున్న రైతులెందరో జిల్లాలో ఉన్నారు. వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

భూ సమస్యలకు పరిష్కారం చూపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో ధరణికారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతుల్లో ఆశలు చిగురించాయి. వీలైతే చట్ట సవరణ చేయడం, లేదంటే కొత్త చట్టం తీసుకువచ్చి రైతులకు న్యాయం చేయాలనే ఆలోచనలో రేవంత్‌రెడ్డి ఉన్నారు. ఇందులో భాగంగా తహసీల్ కార్యాలయాల్లో హెల్ప్‌డెస్క్ ఏర్పాటుకోసం అధికారులకు ఆదేశాలు సైతం జారీ చేశారు. ధరణి పోర్టల్ కారణంగా తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం లభిస్తుంది? రాష్ట్ర ప్రభుత్వం ఎన్నిరోజుల్లో కార్యాచరణను అమలు చేస్తుందని రైతులు ఎదురుచూస్తున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం

ఒకే సర్వే నంబర్‌లో కొందరికి పట్టాభూమిగా, మరికొందరికి ప్రభుత్వ భూమిగా పట్టాలు జారీ అయితే క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికను అధికారులకు పంపుతాం. ఆ తరువాత అధికారుల ఆదేశాల ప్రకారం తప్పులను సవరిస్తాం.

– అనురుధ్, తహసీల్దార్, నిజామాబాద్ రూరల్

ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు జయప్రదం చేయాలి

- అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్, ఎల్‌డీఎం

సుభాష్‌నగర్: రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం నుంచి మార్చి 1 వరకు నిర్వహించే ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. వారోత్సవాలను పురస్కరించుకుని లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ 'మేక్ ఎ రైట్ స్టార్ట్ – బి కమ్ ఫైనాన్షియల్లీ స్మార్ట్' అనే థీమ్‌తో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. వారోత్సవాల్లో భాగంగా ఈనెల 27న పాత కలెక్టరేట్ మైదానం నుంచి ప్రగతి హాస్పిటల్ వరకు 2కే నడక, 28న ఆర్థిక అక్షరాస్యత శిబిరం, 29న అన్ని పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులతో సమావేశమై ఆర్థిక అక్షరాస్యత ప్రాముఖ్యతపై ప్రసంగాలు, కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. అదనపు కలెక్టర్ (యూటీ) కిరణ్మయి, జెడ్పీ సీఈవో ఉషా పాల్గొన్నారు.

క్రీడాసౌకర్యాల మెరుగుకు కృషి

- రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి
- తెయూలో అంతర్ కళాశాలల క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రిజిస్ట్రార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ క్యాంపస్ క్రీడామైదానంలో వర్సిటీ అంతర్ కళాశాలల ఉమెన్ క్రికెట్ టోర్నమెంట్‌ను రిజిస్ట్రార్ ఎం యాదగిరి సోమవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీలో క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడాసౌకర్యాలను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. చదువుతోపాటు క్రీడాపోటీలపై ఆసక్తి చూపాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, వర్సిటీ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ డైరెక్టర్ జి బాలకిషన్, చీఫ్ వార్డెన్ మహేందర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ బీఆర్ నేత తదితరులు పాల్గొన్నారు. టోర్నమెంట్‌లో 12 జట్లు పాల్గొంటున్నాయని, ఈ నెల 29వరకు టోర్నీ కొనసాగుతుందని డైరెక్టర్ బాలకిషన్ తెలిపారు.

మండుటెండ నుంచి మనవరాలికి రక్షణ



బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నగరంలోని గౌతమ్‌నగర్ సెక్టార్‌కు చెందిన అంగన్‌వాడీ ఆయా హన్మాబాయి తన మనవరాలితో కలిసి ధర్నాకు వచ్చింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పక్కనే ఉన్న చెట్టు వద్దకు చేరి మనవరాలికి రక్షణ కల్పించింది. మంచి నీళ్లు తాగించి ఎండబారి నుంచి కాపాడుకుంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

రెవెన్యూ శాఖను మరింత పటిష్టం చేస్తాం

- ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి
- రెవెన్యూ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



డైరీ, క్యాలెండర్‌లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, కలెక్టర్ హనుమంతు

సుభాష్‌నగర్: ప్రభుత్వ కార్యక్రమాల అమలులో క్రియాశీల పాత్ర పోషిస్తూ నిరంతరం ప్రజల సేవలో నిమగ్నమయ్యే రెవెన్యూ శాఖను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం డైరీ, క్యాలెండర్‌ను కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎమ్మెల్యేలు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రితోపాటు రెవెన్యూ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చొరవ చూపుతామన్నారు. ముఖ్యంగా దూర ప్రాంతాలకు బదిలీ అయిన వీఆర్ఏలకు సొంత జిల్లాల్లో పోస్టింగ్ కల్పించేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇతర శాఖల్లో నియమితులైన వీఆర్‌వోలను మళ్లీ రెవెన్యూశాఖలో సర్దుబాటు చేయాలని సీఎంను కోరుతామన్నారు. ఉద్యోగులు సైతం అంకితభావంతో పనిచేస్తూ ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. జిల్లా యంత్రాంగం ద్వారా అమలు చేసే కార్యక్రమాల్లో రెవెన్యూ శాఖకు చెందిన ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకంగా ఉంటుందన్నారు. ఏ కార్యక్రమమైనా సమర్థవంతంగా అమలు కావాలంటే రెవెన్యూ శాఖ తోడ్పాటు అవసరమవుతుందన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు ప్రస్తావించిన సమస్యల్లో తమ పరిధిలోని వాటిని సత్వరమే పరిష్కరిస్తామన్నారు.

ఉద్యోగుల సంఘం సేవలు భేష్

– ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్

రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థను నెలకొల్పి సేవలందించడం అభినందనీయమని ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పేద కుటుంబాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు వైద్య విద్యనభ్యసించేందుకు తోడ్పాటునందిస్తున్నదని, తనవంతుగా కూడా రూ.లక్ష ఆర్థిక సహాయం అందిస్తానని ప్రకటించారు.

ఈ సందర్భంగా రెవె న్యూ ఉద్యోగుల సంఘం బాధ్యులు ఎమ్మెల్సీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, అసోసియేషన్, జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు రమణ్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, వేణు, శ్రీనివాసరావు, నాగార్జున, ప్రభు, శ్రీధర్, శశి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ ఏఈపై విచారణ

నిజామాబాద్ నాగారం: నిరుద్యోగులకు ఉద్యోగులు ఇప్పిస్తానని రూ.లక్షలు వసూలు చేసిన ఏఈ రాంసింగ్‌పై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. సోమవారం నవీపేట్ ఏడీఈ ఆఫీస్‌లో విజిలెన్స్ డీఈ ప్రభాకర్, ఏపీ టీఎస్ సీఐ గోవర్ధన్ విచారణ చేశారు. ఈ ఘటన ఏడేనిమిది ఏళ్ల కిందట జరుగగా, ఇటీవల బాధితులు ఫిర్యాదు చేశారు. అలాగే పత్రికల్లోనూ కథనాలు రావడంతో ఉన్నతాధికారులు స్పందించి విచారణ చేపట్టారు.

ఎమ్మెల్యే కాన్వాయి, ఆటో ఢీ



రుద్రూర్: బోధన్ ఎమ్మెల్యే కాన్వాయిలోని కారు, ఆటో మండలంలోని లింగంపల్లి శివారులో సోమవారం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. కోటగిరి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు బోధన్ ఎమ్మెల్యే వెళ్తుండగా, ఎదురుగా వస్తున్న ఆటో, కాన్వాయిలోని కారు ఢీకొన్నాయి. కారులో ఉన్న ఇద్దరితోపాటు ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. గాయాలపాలైన వారిని చికిత్స నిమిత్తం బోధన్ ఆస్పత్రికి తరలించారు. కారు డ్రైవర్ భూక్యా సతీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

క్రైం కార్నర్

ఖతార్‌లో ఘన్‌పూర్‌తండా వాసి మృతి


- పనిలో చేరిన మొదటిరోజే రోడ్డు ప్రమాదం



గంగావత్ చందర్ (ఫైల్)

రామారెడ్డి: బతుకుదెరువు కోసం ఖతార్‌కు వెళ్లిన కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం రెడ్డిపేట జీపీ పరిధిలోని ఘన్‌పూర్‌తండాకు చెందిన గంగావత్ చందర్(38) అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉపాధి నిమిత్తం కొద్దిరోజుల క్రితం ఖతార్‌కు వెళ్లిన చందర్ ఐదురోజులపాటు స్నేహితులతో కలిసి ఉన్నాడు. పనిలో చేరిన మొదటిరోజే అతడు అదృశ్యం కావడంతో స్నేహితులు గల్ఫ్ సమితి బృందం సహకారంతో చందర్ ఆచూకీ కోసం వెతికారు. అనుమానంతో ఆస్పత్రుల్లో వెతుకగా ఫిబ్రవరి 5వ తేదీన రోడ్డు ప్రమాదంలో చందర మృతి చెందినట్లు వారికి తెలిసింది. తెలంగాణ గల్ఫ్ సమితి అధ్యక్షుడు మైదం మధు ఆస్పత్రికి వెళ్లి మృతదేహాన్ని గుర్తించి, కంపెనీ యాజమాన్యానికి సమాచారం అందించారని తండా వాసులు తెలిపారు. చందర్ మృతదేహాన్ని ఘన్‌పూర్‌తండాకు రప్పించాలని కాంగ్రెస్ నాయకుడు ధన్‌సింగ్‌నాయక్, కుటుంబసభ్యులు సోమవారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీని, జిల్లా కలెక్టర్‌ను కలిశారు. మృతుడికి భార్య లక్ష్మి, ముగ్గురు పిల్లలున్నారు.

బ్యాక్‌వాటర్‌లో గల్లంతైన బాలుడు..



మహేశ్ మృతదేహాన్ని బయటకు తీసుకువస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): చేపలు పట్టేందుకు వెళ్లి నిజాంసాగర్ బ్యాక్ వాటర్‌లో గల్లంతైన బాలుడు లైన్ మహేశ్(15) మృతి చెందినట్లు స్థానికులు సోమవారం తెలిపారు. శనివారం సాయంత్రం బ్యాక్ వాటర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లిన మహేశ్ నీటిగుంతలో పడి గల్లంతయ్యాడు. జాలరులు మహేశ్ కోసం గాలించినా ఆచూకీ లభించలేదు. సోమవారం ఉదయం మహేశ్ మృతదేహం నీటిపై తేలడంతో గ్రామస్తులు మృతదేహాన్ని బయటకు తీసుకువచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని, మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: ఎస్సీ స్టడీ సెంటర్‌లో గ్రూప్స్, పోటీ పరీక్షలకు సంబంధించిన ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సాంఘికసంక్షేమ శాఖ అధికారిణి శశికళ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు నిజామాబాద్ నగరంలోని నాందేవ్‌వాడలో ఐదు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలతోపాటు ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్, ఎస్ఎస్‌సీ అర్హత పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మార్చి 6వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించాలని, 10న ప్రవేశ పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. ప్రవేశపరీక్ష మార్కుల ఆధారంగా 100 మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు ప్రకటనలో తెలిపారు.

వైద్యారోగ్యశాఖలో ఖాళీల భర్తీకి..


నిజామాబాద్‌నాగారం: ఆర్‌బీఎస్‌కే, నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో మెడికల్ ఆఫీసర్స్, డెంటల్ టెక్నిషియన్, సైకాలజిస్ట్ పోస్టులను కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి సుదర్శనం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈనెల 27 నుంచి మార్చి 2వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో జిల్లా కలెక్టర్ వెబ్‌సైట్ nizamabad. telangana. gov. in ద్వారా నిర్ణీత తేదీల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు దరఖాస్తు చేయాలని, అనంతరం దరఖాస్తులను డౌన్‌లోడ్ చేసి వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. మెడికల్ ఆఫీసర్ (పురుష) 3, మెడికల్ ఆఫీసర్ (స్త్రీ) 8, సైకాలజిస్ట్ 1, డెంటల్ టెక్నిషియన్ 1 పోస్టును భర్తీ చేయనున్నట్లు ప్రకటనలో వివరించారు.

ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు..

నేషనల్ హెల్త్ మిషనర్ ద్వారా ఖాళీగా ఉన్న మిడ్ లెవల్ హెల్త్ ఆఫీసర్ (ఎంఎల్‌హెచ్‌పీ) పోస్టులను కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు వైద్యారోగ్యశాఖాధికారి సుదర్శనం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 నుంచి మార్చి 2వ తేదీ వరకు nizamabad. telangana. gov. in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అనంతరం దరఖాస్తులను డౌన్‌లోడ్‌చేసి వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

మద్యం మత్తులో ఆత్మహత్య



లింగం (ఫైల్)

నవీపేట: మండలంలోని నాగేపూర్‌కు చెందిన బోడిగం రాజు (39) మద్యం మత్తులో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ సోమవారం తెలిపారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్‌కు చెందిన రాజు 20ఏళ్ల క్రితం నాగేపూర్‌కు ఇల్లరికం వచ్చాడు. తాగుడికి బానిసైన రాజు మద్యం మత్తులో ఆదివారం రాత్రి ఇంట్లోని దూలానికి ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జీవితంపై విరక్తితో..

తాడ్వాయి(ఎల్లారెడ్డి): ఆరోగ్యం సహకరించడంతోపాటు ఆర్థిక ఇబ్బందులను తాళలేక జీవితంపై విరక్తి చెంది మండలంలోని క్రిష్ణాజివాడికి చెందిన అక్కె లింగం (46) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై సంజీవులు తెలిపిన వివరాల ప్రకారం.. హమాలీ పని చేసుకొని జీవించే లింగం కొన్నినెలల క్రితం పక్షవాతం బారినపడ్డాడు. ఆరోగ్యం సహకరించకపోవడం, ఆర్థిక ఇబ్బందులు ఎక్కువకావడంతో ఇంట్లో ఎవరూలేని సమయంలో సోమవారం రాత్రి ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

భూమి కబ్జాచేసిన వ్యక్తులపై కేసు

కామారెడ్డి టౌన్: హైదరాబాద్‌కు చెందిన రిటైర్ట్ డిప్యూటీ కలెక్టర్ రామ్‌గోపాల్‌రావు భూమిని కబ్జా చేసిన ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రామేశ్వరపల్లి శివారులో రామ్‌గోపాల్‌రావు 2008లో 4.20 ఎకరాల భూమిని కొనుగోలు చేశాడు. పక్కనే వెంచర్ చేస్తున్న శ్రీనివాస్‌తోపాటు మరో నలుగురు తన భూమిని కబ్జా చేస్తున్నారని బాధితుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆరుగురిపై ఫోర్జరీ కేసు నమోదు

ఎడపల్లి(బోధన్): ఫోర్జరీ సంతకాలు చేసి న్యాయస్థానంలో సమర్పించిన రికార్డులను తారుమారు చేసిన ఆరుగురిపై కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రమ్ సోమవారం తెలిపారు. ఆర్థికలావాదేవీలకు సంబంధించిన కేసులో ఎడపల్లికి చెందిన పోల మల్కారెడ్డి , రాజేందర్‌గుప్తా, ఆకుల శ్రీనివాస్, ఎక్లూరి శివరాంప్రసాద్, కుర్నాపల్లికి చెందిన సిల్వర్ శంకర్‌గౌడ్, పటాన్‌చెరుకు చెందిన సున్నం రంగయ్య ఫోర్జరీ సంతకాలు చేసి న్యాయస్థానంలో తప్పుడు రికార్డులను సమర్పించినట్లు తేలడంతో సెక్షన్ 193, 465 కింద కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ దహనం

నవీపేట: మండల కేంద్రానికి చెందిన యువకుడు సాయిలు క్షణికావేశంలో తన బైక్‌ను దహనం చేసుకున్నాడని గ్రామస్తులు తెలిపారు. డబ్బుల విషయంలో తన బావతో సాయిలుకు గొడవ జరుగగా, సాయిలు క్షణికావేశంలో తనబైక్‌ను తానే పెట్రోల్ పోసి దహనం చేశాడని స్థానికులు తెలిపారు.